BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 06 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4

## తెలంగాణకు కొత్త గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివప్రతాప్ శుక్లాను నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి గురువారం సాయంత్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తెలంగాణ గవర్నర్‌గా ఉన్న జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే తమిళనాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్. రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక నాగాలాండ్ గవర్నర్‌గా నందకిశోర్ యాదవ్‌ను, బిహార్ గవర్నర్‌గా విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్‌ను నియమించినట్లు రాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది. మరోవైపు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్న సీవీ ఆనంద బోస్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. ఆయన రాజీనామా అనంతరం రాష్ట్రాల్లో గవర్నర్ల మార్పులు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# యుద్ధాలతో సమస్యలకు పరిష్కారం లేదు..

- శాంతి, సంభాషణల ద్వారానే మార్గం
- గ్లోబల్ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరం
- ప్రధాని మోడీ

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారమని తెలిపారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్లో గురువారం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతిపై భారత్, ఫిన్లాండ్ నమ్మకం ఉంచుతున్నాయని పేర్కొన్నారు.

ఏ సమస్యకూ సైనిక ఘర్షణలతో పరిష్కారం రాదని మోదీ స్పష్టం చేశారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం అయినా, పశ్చిమాసియా సంక్షోభమైనా వీలైనంత త్వరగా ముగియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం ఆధారంగా సమస్యలకు పరిష్కారం కనుగొనాలని సూచించారు.



భారత్--ఫిన్లాండ్ ద్వైపాక్షిక సంబంధాలు కొత్త దశకు చేరుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. కృత్రిమ మేధస్సు, 6జీ టెలికాం, క్లీన్ ఎనర్జీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో రెండు దేశాలు కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ భాగస్వామ్యం సాంకేతిక, ఆర్థిక సహకారానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక మార్పిడి పెరగడానికి తాజా ఒప్పందాలు దోహదపడతాయని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ కంపెనీలు భారత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. ముఖ్యంగా నోకియా టెలికాం నెట్‌వర్క్‌లు కోట్లాది భారతీయులను అనుసంధానించాయని చెప్పారు. అలాగే చెనాబ్ రైల్వే వంతెన నిర్మాణంలో ఫిన్లాండ్ నిపుణుల సహకారం ఉందని తెలిపారు. అసోంలోని నుమాలిగఢ్ బయోఎథనాల్ రిఫైనరీ కూడా రెండు దేశాల భాగస్వామ్యానికి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవాలంటే గ్లోబల్ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో నిర్మూలించేందుకు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ ఏడాది వరల్డ్ సర్క్యులర్ ఎకానమీ ఫోరంను భారత్‌లో ఫిన్లాండ్‌తో కలిసి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు స్టబ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యవస్థ మార్పు దశలో ఉందని అన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు భవిష్యత్ దిశను నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలని బహిరంగంగా మద్దతు తెలిపారు. వాణిజ్యాన్ని రెట్టింపు చేయడం రెండు దేశాల లక్ష్యమని వెల్లడించారు. ఇక స్టబ్ ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్‌లో పాల్గొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ సరదాగా స్పందించారు. ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే 'త్రయాథ్లాన్'ను భారత్--ఫిన్లాండ్ సంబంధాల్లో సాధిస్తామని అన్నారు. ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ వాతావరణంలో శాంతి, సంభాషణ, రాజనీతికి భారత్ ప్రాధాన్యం ఇస్తున్నదని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది.



## ఖమేనీ మృతికి భారత్ సంతాపం

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారత్ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లిన భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ భారత్ తరపున సంతాప సందేశాన్ని రాశారు. అనంతరం ఇరాన్ రాయబారితో మిస్రీ మాట్లాడారు. ప్రస్తుతం ఇరాన్‌లో నెలకొన్న పరిస్థితులపై వారు చర్చించారు.

ఇటీవల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు దాడిచేసి ఆ దేశపు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హతమార్చాయి. దాంతో పొరుగు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. దాడులు, ప్రతిదాడులతో మధ్యప్రాచ్యం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రపంచదేశాలకు చమురు సరఫరాలో జీవనాడి లాంటి హార్ముజ్ జలసంధిని మూసివేసింది.

## మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నుంచి ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాల కోసం కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేమ్ నరేందర్ రెడ్డి గురువారం తమ నామినేషన్లు దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ శాసనసభ కార్యాలయంలో ఈ ప్రక్రియ జరిగింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా హాజరయ్యారు.

రాష్ట్రానికి కేటాయించిన రెండు రాజ్యసభ స్థానాలను భర్తీ చేయడానికి ఈ ఇద్దరూ పోటీ చేస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టే సూచనలు లేకపోవడంతో వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నామినేషన్ల దాఖలుకు గురువారమే చివరి తేదీగా ఉంది.

అభిషేక్ మను సింఘ్వీ గతంలో ఒకటిన్నర సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసిన తర్వాత మళ్లీ తెలంగాణ నుంచి రాజ్యసభకు పార్టీ తరపున నామినేట్ చేయబడ్డారు.

నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడిన సింఘ్వీ, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే అనేక అంశాలను సుప్రీంకోర్టులో కూడా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. మరో అభ్యర్థి వేమ్ నరేందర్ రెడ్డి కూడా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన ఆయన, రాజ్యసభలో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను సమర్థంగా ప్రతినిధ్యం వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితర నేతలకు ఇద్దరూ కృతజ్ఞతలు తెలిపారు.

## రాజ్యసభకు బీహార్ సీఎం నామినేషన్ దాఖలు



బలగం టీవి, పాట్నా

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాబోయే రాజ్యసభ ఎన్నికల కోసం గురువారం నామినేషన్ దాఖలు చేశారు. దీంతో 2005 నుంచి కొనసాగుతున్న ఆయన దీర్ఘకాల ముఖ్యమంత్రి పదవీకాలానికి ముగింపు పలుకుతున్నట్లైంది.నితీష్ కుమార్ ఇప్పటివరకు బిహార్ ముఖ్యమంత్రిగా అత్యధిక కాలం పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. గత ఏడాది నవంబర్ 20న పట్నాలో జరిగిన ఘన కార్యక్రమంలో ఆయన రికార్డు స్థాయిలో 10వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ దాఖలు గడువు గురువారంతో ముగియనుంది. ఈ సందర్భంగా నితీష్ కుమార్ మాట్లాడుతూ తన రాజకీయ ప్రయాణం ప్రారంభం నుంచే బిహార్ శాసనసభ, శాసన మండలి మాత్రమే కాకుండా పార్లమెంట్ రెండు సభల్లో సభ్యుడిగా ఉండాలని ఆకాంక్షించానని తెలిపారు. తాను రాజ్యసభకు వెళ్లినా రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వానికి పూర్తి సహకారం, మార్గదర్శనం అందిస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లనున్న నేపథ్యంలో బిహార్ రాజకీయాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి. త్వరలో బిహార్‌కు భారతీయ జనతా పార్టీకి చెందిన తొలి ముఖ్యమంత్రి రావచ్చనే చర్చలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. కాగా, బిహార్ సహా 10 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

## పశ్చిమ బెంగాల్ గవర్నర్ రాజీనామా

- కొత్త గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి



సీవీ ఆనంద బోస్

బలగం టీవి, కోల్‌కతా

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేసినట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు ఇప్పటివరకు వెల్లడికాలేదు. ఈ పరిణామంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గవర్నర్ రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని ఆమె తెలిపారు."గవర్నర్ రాజీనామాకు గల అసలు కారణం నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఏదైనా రాజకీయ ఒత్తిడి ఉండొచ్చని అనిపిస్తోంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం నుంచి ఆయనపై ఒత్తిడి ఉండి ఉండొచ్చు" అని మమతా వ్యాఖ్యానించారు.

### కొత్త గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి



కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవిని నియమించనున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందిందని ఆమె చెప్పారు. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో తనను సంప్రదించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మమతా విమర్శించారు. సహకార సమాఖ్య వ్యవస్థకు కేంద్రం తగిన గౌరవం ఇవ్వాలని, రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలని ఆమె కోరారు.

సీవీ ఆనంద బోస్ పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా సుమారు మూడున్నర సంవత్సరాలు సేవలందించారు. ఈ కాలంలో ఆయనకు సీఎం మమతా బెనర్జీతో పలు అంశాలపై విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గవర్నర్ల వ్యవస్థపై మమతా తరచుగా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ఆనంద బోస్ ఢిల్లీలో ఉన్నారని, తన రాజీనామా విషయమై కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

## పంచాయతీ బిల్లుల చెల్లింపులకు గ్రీన్‌సిగ్నల్



- 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.245 కోట్లు విడుదల
- తాగునీరు, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం
- మంత్రి సీతక్క

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో గ్రామ పంచాయతీల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుల వివాదానికి రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులపై నెలకొన్న అనిశ్చితిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం 2023--24 ఆర్థిక సంవత్సరానికి గాను 'టైడ్ కాంపొనెంట్' కింద రూ.245 కోట్ల నిధులను విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిధులను ప్రభుత్వం నిర్దేశించిన పనులకే వినియోగించాలని స్పష్టం చేశారు.

### తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

గ్రామాల్లో ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. గత సర్పంచుల హయాంలో ఈ రెండు విభాగాల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను నిబంధనల ప్రకారం చెల్లించవచ్చని తెలిపారు. దీంతో గ్రామాల్లో పనులు చేసి చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లకు ఊరట లభించనుంది.

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరగకూడదని మంత్రి స్పష్టం చేశారు. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న సాధారణ నిధుల నుంచి వారికి వేతనాలు చెల్లించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా కొనసాగాలంటే కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు.

### పారదర్శకంగా నిధుల వినియోగం

ప్రభుత్వం విడుదల చేసిన నిధులు దుర్వినియోగం కాకుండా పారదర్శకంగా అర్హులకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. నిధుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడా నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన పంచాయతీ అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య, తాగునీటి సేవలు మరింత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## మూసీ పేరుతో దోపిడీకి కాంగ్రెస్ కుట్ర



- బీఆర్ఎస్ పాలనలో ఇళ్లు కూల్చకుండా మూసీ అభివృద్ధి పనులు చేపట్టాం
- కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అసలు ఉద్దేశం భారీ స్కామ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్‌లోని నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మూసీ నది పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ భారీ అవినీతికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆయన ఆరోపించారు.

గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి నాగోల్ ప్రాంతంలో పర్యటించిన కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ నదిలోని మురుగు నీటిని శుద్ధి చేయాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున ప్రణాళికలు రూపొందించిందన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎస్టీపీగా నిలిచే నాగోల్ ఎస్టీపీని సుమారు రూ.4 వేల కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఇళ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీ అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు.

2023 డిసెంబర్ నాటికి ఎస్టీపీ నిర్మాణం 85 శాతం పూర్తయిందని, కేసీఆర్ ప్రభుత్వం మూసీపై 15 వంతెనలకు ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. మిగిలిన పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అసలు ఉద్దేశం అభివృద్ధి కాదని, భారీ స్కామ్‌కు దారితీయడమేనని కేటీఆర్ ఆరోపించారు. రూ.16 వేల కోట్లలో పూర్తి చేయగల ప్రాజెక్టును పది రెట్లు పెంచి రూ.1.5 లక్షల కోట్లకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజల ఇళ్లను కూల్చివేస్తోందని, ఇది పూర్తిగా అరాచక పాలనకు నిదర్శనమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఇళ్లు కూడా ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ వాటిని కూల్చే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లను కూల్చి ప్రజలను రోడ్డున పడేయడం ద్వారా ఏమి సాధించాలనుకుంటున్నారని కేటీఆర్ నిలదీశారు. మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో పేదల గుడిసెలను బుల్డోజర్లతో కూల్చివేసిన ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. ఈ విషయాలు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కనిపించడంలేదా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే హైదరాబాద్ అంతటా నీటి శుద్ధీకరణ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు కేటీఆర్ తెలిపారు. నాగోల్ ప్రాంతంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీ అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కారణంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న ప్రజలతో మాట్లాడి వారికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. అవసరమైతే తక్కువ ఖర్చుతో మూసీని అభివృద్ధి చేసి చూపిస్తామని కూడా ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

## నాంపల్లి రైల్వే స్టేషన్ హైదరాబాద్‌కు మరో తలమానికం

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలోని నాంపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తయ్యాక ఇది నగరానికి మరో తలమానికంగా నిలవబోతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.


ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్టేషన్ అభివృద్ధికి సుమారు రూ.350 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్టేషన్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా రూపుదిద్దుతున్న ఈ ప్రాజెక్టులో 16 లిఫ్టులు, 8 ఎస్కలేటర్లు, అత్యాధునిక పార్కింగ్ సదుపాయాలు, ఆధునిక రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో రైల్వే రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.47 వేల కోట్ల వ్యయంతో రైల్వే నెట్‌వర్క్ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నీ 2027 చివరి నాటికి పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.



అదేవిధంగా రాష్ట్రంలో మరో 384 కిలోమీటర్ల మేర కవచ్ టెక్నాలజీ అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ సాంకేతికత ద్వారా రైళ్ల భద్రత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. 'వన్ స్టేషన్ -- వన్ ప్రొడక్ట్' పథకం ద్వారా స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో రైల్వే రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ కొత్త పుంతలు తొక్కుతోందని ఆయన స్పష్టం చేశారు.

## భవనంపై నుంచి పడి ఇద్దరు మృతి

- మరో ముగ్గురికి గాయాలు



బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్‌లోని టోలిచౌకిలో గురువారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి కిందపడడంతో ఇద్దరు కార్మికులు మతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలిచౌకిలోని అల్ హస్నాత్ కాలనీలో ఆరంతస్తుల భవనం నిర్మాణం జరుగుతోంది. భవనం పైభాగంలో ఏర్పాటు చేసిన గోవా కర్రలపై కార్మికులు పనులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఆ కర్రలు అకస్మాత్తుగా కూలిపోయాయి. దాంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు పై నుంచి కిందపడిపోయారు. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన తిరుపతిరావు (30), ఆదినారాయణ (50) అక్కడికక్కడే మతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న టోలిచౌకి పోలీసులు, రెస్క్యూ బందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆర్. రమేష్, ఒడిశాకు చెందిన మేస్త్రీ ఎం. రమేష్, నగరంలోని ఇస్మాయిల్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ లాల్ అహ్మద్ ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

## దురుద్దేశం లేదు.. ప్రజాధనం దుర్వినియోగం జరిగింది

- ఏజీ ఎ. సుదర్శన్ రెడ్డి
- కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టులో విచారణ

బలగం టీవి, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున ఏజీతో పాటు పిటిషనర్ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు.

ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ మాట్లాడుతూ.. ఎవరినైనా టార్గెట్ చేసేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల లాభం కంటే నష్టం ఎక్కువగా జరిగిందని, నిర్మాణంలో అధికార దుర్వినియోగం జరిగినట్లు కమిషన్ గుర్తించిందని పేర్కొన్నారు.ఇక పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కమిషన్ నివేదికలో పలువురిపై తప్పుడు ఆరోపణలు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎక్కడా బిజినెస్ రూల్స్‌ను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు కోర్టుకు వివరించారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా పేర్కొనడం సరైంది కాదని వాదించారు. కమిషన్ తప్పుడు విధానంలో నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ప్రాజెక్ట్ స్థల మార్పిడి, ఖర్చుల అంచనా, నిర్మాణ సంస్థలకు కాంట్రాక్టుల కేటాయింపులో ఎవరూ లబ్ధి పొందలేదని పేర్కొన్నారు.కాళేశ్వరం కమిషన్ నివేదిక చెల్లదని, దీనిపై స్టే ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది.

## డిజిటల్ అరెస్ట్ పేరిట మోసం

- రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నుంచి రూ.98,888 కాజేసిన సైబర్ నేరగాళ్లు

బలగం టీవి, హైదరాబాద్

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సైబర్ నేరగాళ్ల బారిన పడ్డారు. డిజిటల్ అరెస్ట్ పేరిట బెదిరింపులకు పాల్పడిన మోసగాళ్లు బాధితుడి నుంచి రూ.98,888 వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలకు స్పందించవద్దని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు.

## ముగిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి విచారణ

- ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ వాయిదా



బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంలో విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ సాయంత్రానికి ముగిసింది. అయితే మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. దీంతో ఆయన కేసు విచారణను స్పీకర్ శనివారం (మార్చి 7)కు వాయిదా వేశారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరుకావాలని ఇరు వర్గాలకు స్పీకర్ సూచించారు.పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలపై ఇప్పటికే స్పీకర్ విచారణ పూర్తి చేశారు. ఆ కేసుల్లో సంబంధిత ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే.

## పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సద్వినియోగించుకోవాలి

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సద్వినియోగం చేసుకోవా లని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు టీ ఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించా లని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమ లో భాగంగా పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని పిలుపునిచ్చారు. మూడు కిలోవాట్ల సోలార్ పలకలు




ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని అన్నారు . పెట్టుబడి ఆరు సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని సూచించారు. ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో సెస్ ఎండీ బిక్షపతి, డీఈ అంజయ్య, డీఓ మునీందర్ రెడ్డి, ఏడీఓ లక్ష్మీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## వరి ధాన్యం కమిషన్ పై రైతుల ఆగ్రహం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు సమయంలో కమిషన్ డబ్బుల వినియోగంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులపై రైతులు వాగ్వాదం చేశారు. పదేళ్లుగా వచ్చిన కమిషన్ డబ్బుల లెక్కలు, ఎక్కడ ఖర్చు అయ్యాయో వివరాలు గ్రహించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సమావేశంలో, మహిళా సంఘాల సీఏలను నిలదీసి, లెక్కల వివరాలను బహిర్గతం చేయాలని ఆగ్రహభరితంగా విజ్ఞప్తి చేశారు. రైతుల తీర్మానం ప్రకారం, ఈ లెక్కలు పూర్తిగా అందించబడకపోతే, స్థానికంగా బహిర్గతం చేయడం కోసం పునరాలోచనలు అవసరమని చెప్పారు

## నిరుపేద యువతి భార్గవి వివాహానికి కేటీఆర్ కానుక..

- **మున్సిపల్ చైర్‌పర్సన్ చేతుల మీదుగా వివాహ కానుక అందజేత..**
- **ఆనందం వ్యక్తం చేసిన భార్గవి..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్థానిక 12వ వార్డు జ్యోతి నగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యువతి భార్గవి వివాహానికి సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు పంపించిన వివాహ కానుకను పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి గురువారం రోజు భార్గవికి అందజేశారు. బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో కేటీఆర్ పంపించిన ఆ కానుకను భార్గవికి అందించడం జరిగిందని తెలిపారు. నిరుపేద యువతి వివాహానికి ఒక అన్నగా అండగా నిలిచిన కేటీఆర్ కి తమ తరపున, అలాగే భార్గవి కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ.. కేటీఆర్ "గిఫ్ట్ స్మైల్" వంటి సామాజిక కార్యక్రమాల ద్వారా వివిధ సందర్భాల్లో ఎంతోమందికి సహాయ సహకారాలు అందిస్తూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు లేని భార్గవి వివాహానికి ఒక అన్నగా అండగా నిలవడం తమకు ఎంతో గర్వకారణమని చెప్పారు. కేటీఆర్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసి రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందర కళ చక్రపాణి మాట్లాడుతూ.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన భార్గవి తన మేనమామ సంరక్షణలో ఒక అక్క, ఒక తమ్ముడితో కలిసి పెరిగిందని తెలిపారు.



భార్గవి వివాహం ఈ నెల 12వ తేదీన జరగనుండగా, వారి కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రూ.50 వేల నగదు సహాయం తో పాటు కాబోయే వధూవరులకు కొత్త బట్టలను వివాహ కానుకగా పంపించారని చెప్పారు.

ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన తాను ఈ నెల 12వ తేదీన నిర్వహించుకోనున్న తన వివాహ విషయాన్ని పెద్దలు కేటీఆర్ అన్నగారి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన పెద్ద మనసుతో రూ.50 వేల నగదు సహాయం చేసి, మంచి బట్టలు అందించి తమకు ఆశీర్వాదాలు తెలియజేసి కొండంత అండగా నిలిచారని భావోద్వేగంతో తెలిపారు. ఇలాగే తనలాంటి ఎంతోమందికి ఆయన అండగా నిలవాలని కోరుకుంటూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూర బాలుమల్లు, మొగిలి నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు సత్తార్, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, 12వ వార్డు అధ్యక్షుడు విరగొని శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ప్రభుదాసు, మాజీ సర్పంచ్ అన్నవేని బాలయ్య యాదవ్ తదితరులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత్ యూత్ పార్లమెంట్ 2026.. సిరిసిల్ల జిల్లాలో విస్తృత ప్రచారం.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించనున్న వికసిత భారత్ యూత్ పార్లమెంట్ 2026 పోటీలకు విస్తృత ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు దేశ అభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలని, తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచాలని శాతవాహన యూనివర్సిటీ ఎంఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ కోరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ మరియు డాక్టర్ డి. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలలో కళాశాల విద్యార్థులు తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా తెలియజేసి జాతి అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలు మార్చి 9, 2026న సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వికసిత భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాల్సిందిగా సిరిసిల్ల జిల్లాలోని అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ మరియు నర్సింగ్ కళాశాలల్లో విస్తృత ప్రచారం చేపట్టారు.

ఈ పోటీల అంశం "50 సంవత్సరాల ఎమర్జెన్సీ మరియు భారతదేశ ప్రజాస్వామ్యానికి ఇచ్చే పాఠాలు". ఈ అంశంపై విద్యార్థులు మూడు నిమిషాల పాటు ఉపన్యాసం ఇవ్వాల్సి ఉంటుంది. పోటీలలో ఐదుగురిని విజేతలుగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో గరిష్టంగా ముగ్గురికి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది.ఈ కార్యక్రమంలో మేరా భారత్ జిల్లా అధికారి ఎం. వెంకట రాంబాబు, ఎస్.ఆర్.ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకురాలు బి. ఎలిజబెత్ రాణి మరియు ఇతర అధ్యాపకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## జోన్-Iలో 8 ఇన్‌స్పెక్టర్ల బదిలీలు..

- **సిరిసిల్ల టౌన్ సీఐగా నెమ్మని శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జోన్--I పరిధిలోని పోలీస్ సిబ్బందిపై పరిపాలనా మార్పులు కొనసాగుతున్నాయి. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం 8 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జారీ అయ్యాయి. ఈ బదిలీలలో నెమ్మని శ్రీనివాస్ సిరిసిల్ల టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, కదిర నాగేశ్వరరావు సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మొగిలి జిల్లా డీసీఆర్బీకి బదిలీ చేయబడ్డాడు. అలాగే, కరీంనగర్‌ రాజక్మ్మలో ఉన్న ఓదెల వెంకటేశ్ ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితుడయ్యాడు. సంబంధిత అధికారులు వెంటనే తమ కొత్త విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈ బదిలీలు సర్కిల్ మరియు జిల్లా స్థాయిలో పోలీస్ పరిపాలనలో మరింత సమర్థత కలిగించేందుకు తీసుకున్న చర్యగా పోలీసులు వెల్లడించారు.



## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన జిల్లా పాస్టర్ అసోసియేషన్ నూతన కమిటీ.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ క్రైస్తవులకు అండగా ఉంటానని నూతన కార్యవర్గం జిల్లాలో ఉన్న ప్రతి క్రైస్తవుడిని కలుపుకొని వెళ్తే బాగుంటుందని నూతన కార్యవర్గానికి సూచించారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు కూడా క్రైస్తవ మైనార్టీలకు అందే విధంగా చూస్తానని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ అన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్, క్యాషియర్ ప్రభుదాస్, జాయింట్ సెక్రెటరీ జోసెఫ్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆహారోను, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కులేరి కిషోర్ కుమార్, స్టీరింగ్ కమిటీ సభ్యులు తిమోతి, రాజు, వేములవాడ పాస్టర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ప్రసాద్, వివిధ మండలాల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో 15న మాన్యశ్రీ కాన్షీరాం జయంతి భారీ బహిరంగ సభ...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, బహుజన జన హృదయ సామ్రాట్ మాన్యశ్రీ కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీన సిరిసిల్లలో 5000 మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కోమ్మెట అశోక్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల వెంకన్న వెల్లడించారు. గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ వివరాలను వెల్లడించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించేందుకు ఈనెల 6వ తేదీ సిరిసిల్ల రెండో బైపాస్‌లోని కామాక్షి బ్యాంకెట్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడం మరియు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్, జోనల్ చీఫ్ కోఆర్డినేటర్ నిషాని రామచంద్రం, వివిధ పార్లమెంట్ నియోజకవర్గాల రాష్ట్ర స్థాయి నాయకులు హాజరుకానున్నారు.



## తోట ఆగయ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన పాస్టర్స్ జిల్లా నూతన కార్యవర్గం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్?ఎస్? పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ను జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు. 11వ తేదీన జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్, జిల్లా కోశాధికారి ప్రభుదాస్, జాయింట్ సెక్రెటరీ జోసెఫ్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆహారోను, ప్రసాద్, జిల్లా మీడియా కన్వీనర్ కులేరి కిషోర్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి ఆనారోగ్య సమస్యను తెలుసుకున్నారు. పీ హెచ్ సీ పరిధిలో కొత్తగా, ఇప్పటికే మొదలు పెట్టిన హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై వైద్యాధికారిని ఆరా తీశారు. వాటి పై అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు.

**తహసీల్ కార్యాలయంలో పరిశీలన**

మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, భూ భారతి రిజిస్ట్రేషన్ గది, కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే వారికి సేవలు అందించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేసారు. ఇక్కడ తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# స్వయం ఉపాధి పై మహిళలకు శిక్షణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ గ్రామంలోని చర్చ్ లో బుధవారం మహిళలకు స్వయం ఉపాధి పై సేవా భారత్, రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు వాడుకునే షాంపూ, సర్ఫ్, వాస్ లైన్, జండుబాం, షాంపూ వాటర్, ఫినాయిల్, ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు మహిళలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని ఏఎన్ఎం సుమలత, రుతమ్మ మహిళలకు అవగాహన కల్పించారు. కూరగాయలు ప్రతి ఒక్కరూ ఎలాంటి మందులు వేయకుండా పండించుకుంటే వాటిని తినడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు. స్వయం ఉపాధి శిక్షణ శిబిరము ద్వారా మహిళలు స్వయంగా ప్రతిరోజు వాడుకునే వస్తువులను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చని సేవా భారత్ కోఆర్డినేటర్ రాజచంద్ర, రాజేష్ ఫౌండేషన్ ఫౌండర్, పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్, పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా మీడియా కన్వీనర్ పాస్టర్ కులేరి కిషోర్ కుమార్ మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొర్రి అనిల్ తయారుచేసిన వస్తువులను మహిళలకు అందజేశారు. సుమారు 70 మంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాలి..

**మహిళా కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




కేంద్ర పెట్రోలియం మరియు సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోసంతకాల సేకరణ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. జెఫ్రీ ఎప్‌స్టన్ వ్యవహారానికి సంబంధించిన అంశాలపై మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జెఫ్రీ ఎప్‌స్టన్ వ్యవహారంలో మంత్రి పేరు ప్రస్తావనకు వచ్చిందనే ఆరోపణల నేపథ్యంలో ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చిన్నారులపై జరిగిన లైంగిక, శారీరక, మానసిక వేధింపులకు న్యాయం చేయాలని మహిళా కాంగ్రెస్ తరపున డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులపై అరెస్టులు చేసి వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వారిని వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్, ఏఎంసీ చైర్మన్ వెలమల స్వరూప, కౌన్సిలర్లు వెంగళ లీల, ఆడెపు చంద్రకళ, సుల్తానా, సీనియర్ నాయకురాలు మడుపు శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, వైస్ ప్రెసిడెంట్ సామల రోజా, జయలక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు,మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి..

- **సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు**
- **మహిళలను వేధిస్తున్న పోకిరీలపై ఫిబ్రవరిలో 04 కేసులు,06 పెట్టి కేసులు నమోదు.**
- **మహిళలు,విద్యార్థినిలు వేధింపులకు గురైతే షీ టీమ్ నెంబర్ 8712656425కు పిర్యాదు చేసినచో చట్టపరమైన చర్యలు.**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థినులు,మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు భరోసా ఇచ్చారు.జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఫిబ్రవరి నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 04 ఎఫ్ఐఆర్‌లు, 06 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారియెక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు. మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లో గాని, మరేక్కడైన లైంగిక వేధింపులకు గురౌవుతున్న, ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు, విధ్యార్థినులు, బాలికలు మౌనంగా ఉండ కుండా, ధైర్యంగా పిర్యాదు చేయాలని సూచిం చారు. ఎవరైనా ఆకతయులు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యాసంస్థలల్లో ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు.

# సిరిసిల్లలో ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించాలి..

- **మున్సిపల్ కమిషనర్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని గృహ యజమానులు మరియు వాణిజ్య స్థలాల యజమానులు ఆస్తి పన్ను (ప్రాపర్టీ ట్యాక్స్), ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఇతర లైసెన్స్ ఫీజులు మరియు ప్రకటనల ఫీజులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు పన్నుల ద్వారా లభించే ఆదాయంతోనే నిర్వహించబడుతున్నాయని ఆయన తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థ బలోపేతం వంటి పనులు ఈ ఆదాయంతోనే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి పన్నుదారుడు తన బాధ్యతగా భావించి ఎలాంటి బకాయిలు లేకుండా తక్షణమే పన్నులు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఇంటింటి సేకరణతో పాటు ఫీల్డ్ సందర్శనలు నిర్వహిస్తూ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి సహకరించి సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ కోరారు.

# మోసం చేశారని కూతురు, అల్లుడు ఇండి ముందు మహిళ ధర్నా

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో ఓ వృద్ధ మహిళ తన కుమార్తె, అల్లుడిపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ఇంటి ముందు ధర్నాకు దిగిన ఘటన సంచలనం రేపింది. బాధితురాలు రేవతి తెలిపిన వివరాల ప్రకారం, తన భర్త మరణానంతరం వచ్చిన పెన్షన్ డబ్బులు, ఉద్యోగ బెనిఫిట్స్‌తో పాటు మొత్తం కోటి రూపాయల నగదు, 9 తులాల బంగారం తన కుమార్తెకు నమ్మకంతో ఇచ్చానని తెలిపింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన రేవతి కుమార్తె శ్రావణి ప్రస్తుతం సిరిసిల్లలోని శాంతినగర్‌లో సిద్ధార్థనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆమె తమ్ముడైన నా కొడుకు నిన్ను చూసుకోడని నమ్మబలికి తన వద్ద ఉన్న మొత్తం డబ్బులు, బంగారం తీసుకున్నారని రేవతి ఆరోపించింది. అనంతరం తనను ఇంటి నుంచి బయటకు గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తన అల్లుడు కూడా ఇంటికి వస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆమె చెప్పింది. తన డబ్బులు, బంగారం తిరిగి ఇవ్వాలని అడగడానికి ఇంటి వద్దకు వెళ్లగా, ఇంట్లోకి వస్తే చంపేస్తామని బెదిరించి పంపించేశారని రేవతి తెలిపారు. ఈ వ్యవహారంలో బీజేపీ నాయకుడు దుమాల శ్రీకాంత్ పాత్ర ఉందని రేవతి ఆరోపిస్తూ మీడియా ముందే ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమార్తె, అల్లుడు తమపై తిరుగుబాటు చేస్తున్నారని ఆమె ఆరోపించింది. తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని, తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంది. ఈ విషయమై పలుమార్లు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా సరైన న్యాయం జరగలేదని రేవతి వాపోయింది. చివరికి సిరిసిల్లలోని శాంతినగర్‌లో కుమార్తె ఇంటి ముందు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నాకు దిగింది.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రేవతిని అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మహిళ ఆందోళన విరమించింది.. బాధితురాలు తనకు జరిగిన అన్యాయంపై అధికారుల ద్వారా న్యాయం జరగాలని కోరుతున్నారు.

# వేములవాడలో లాడ్జిలో అనుమానాస్పద మృతి

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు లాడ్జిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లాడ్జిలో ఉన్న ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గమనించిన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే ఇది హత్యా? లేక ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు ఎవరు, ఎక్కడి నుండి వచ్చాడు అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లోకి భారత్

- **ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో భారత్ విజయం..**
- **ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో పోరు**



**బలగం టీవీ, ముంబై**

ఐసీసీ టీ20 ప్రపంచకప్--2026 టోర్నీలో టీమిండియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. వాంఖడే స్టేడియం వేదికగా గురువారం జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి తుదిపోరుకు అర్హత సాధించింది. 254 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో భారత బౌలర్లు కీలక పాత్ర పోషించారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 253 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. సంజూ శాంసన్(89) అర్ధశతకంతో రాణించగా, శివమ్ దూబే (25 బంతుల్లో 43), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39) వేగంగా పరుగులు సాధించారు. చివర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21), హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27) దూకుడుగా ఆడి జట్టు స్కోరును భారీగా పెంచారు. ఇంగ్లండ్ బౌలర్లలో విల్ జాక్స్, ఆదిల్ రషీద్ రెండేసి వికెట్లు తీశారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసి ఓటమిపాలైంది. జాకోబ్ బెతెల్ 48 బంతుల్లో 105 పరుగులతో శతకం సాధించి ఒంటరి పోరాటం చేశాడు. విల్ జాక్స్ 35 పరుగులతో సహకరించాడు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీసుకోగా, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలో వికెట్ సాధించారు. చివరి ఓవర్లలో జస్‌ప్రీత్ బుమ్రా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు మళ్లించాడు. చివరి ఓవర్లో 30 రన్స్ అవసరమవ్వగా.. సెంచరీతో జోరుమీదున్న బెథెల్ క్రీజులో ఉండడంతో అందరిలో ఉత్కంఠ. కానీ, స్ట్రెయిట్‌గా ఆడిన బెథెల్ రెండు పరుగులు తీసే క్రమంలో రనౌటయ్యాడు. తర్వాత మూడు బంతుల్ని జోఫ్రా ఆర్చర్(19 నాటౌట్) సిక్సర్లుగా మలిచాడు. 240 పరుగులకే పరిమితమైంది. ఈ విజయంతో భారత్ ఫైనల్‌కు చేరగా, ఆదివారం అహ్మదా బాద్‌లో జరిగే తుదిపోరులో న్యూజిలాండ్‌తో తలపడనుంది.





# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"ను పకడ్బందీగా అమలు చేయాలి



- **జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం**
- **గ్రామం నుంచి జిల్లా వరకు సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి..**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు."ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత కాలపరిమితిలో లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత ఉందని అన్నారు . ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రతి శాఖ తమ పరిధిలో పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు .మండల అధికారులు తమ పరిధిలోని హౌసింగ్, పీఆర్, ఆర్ అండ్ బీ, సెస్ ఏఈలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, మండల వైద్యాధికారులు, ఎస్‌హెచ్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లోని సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా అంశాలపై చర్చించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి ప్రజాప్రతినిధులను కార్యక్రమాలకు ఆహ్వానించి సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ నెల 12వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల వార్డు సభ్యులు, చైర్మన్లకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమాలను ఐదు దశల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 2న మొదటి దశలో గ్రామ స్థాయిలో గ్రామ సభలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 16న రెండో దశలో మండల స్థాయిలో కార్యక్రమాలు జరుగుతాయి. మే 2న మూడో దశలో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మే 22న నాలుగో దశలో జిల్లా స్థాయిలో విస్తృత కార్యక్రమాలు చేపడతారు. జూన్ 2న ఐదో దశగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు.గ్రామ సభల సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

**శాఖల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు**


మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఏప్రిల్ 6 నుంచి 11 వరకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యక్రమాలు, ఏప్రిల్ 13 నుంచి 18 వరకు హోం శాఖ, రవాణా శాఖల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఏప్రిల్ 20 నుంచి 26 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, హౌసింగ్ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు చేపడతారు. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో "డ్రగ్స్‌కు నో చెప్పండి" కార్యక్రమం నిర్వహిస్తారు.

మే 4 నుంచి 10 వరకు వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, ఇంధన శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యక్రమాలు, మే 11 నుంచి 16 వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా కార్యక్రమాలు జరుగుతాయి. మే 18 నుంచి 23 వరకు యువజన వ్యవహారాలు, పర్యాటక, క్రీడాశాఖల ఆధ్వర్యంలో యువజన, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మే 25 నుంచి 30 వరకు మహిళా, శిశు అభివృద్ధి శాఖ, సెర్ప్/మెప్మా ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. జూన్ 1 నుంచి 12 వరకు అటవీ, పర్యావరణ, విజ్ఞాన సాంకేతిక శాఖల ఆధ్వర్యంలో పర్యావరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌డీఓ గీత, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీపీవో షరీఫుద్దిన్, జిల్లా వైద్యాధికారి రజిత, హౌసింగ్ పీడీ సాజిద్, డీటీఓ లక్ష్మణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల తేదీ ముందుకు...

**బలగం టీవీ, హైదరాబాద్**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, దర్శకుడు హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అభిమానులకు రెండు కీలక అప్‌డేట్స్ ప్రకటించింది. ముందుగా ప్రకటించిన తేదీ కంటే వారం ముందుగానే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపి ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని పెంచింది. నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనలో, ముందుగా ఈ నెల 26న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని ఇప్పుడు వారం ముందుకు జరిపి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. "మా ఉస్తాద్ బాక్సాఫీస్ వద్ద భారీ సంబరాలు మొదలుపెట్టడానికి వారం ముందే వస్తున్నారు" అంటూ చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇదిలా ఉండగా విడుదల తేదీ మార్పునకు ఒకరోజు ముందే చిత్ర బృందం మరో కీలక ప్రకటన చేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవి శ్రీ ప్రసాద్ పనిచేస్తుండగా, నేపథ్య సంగీతం (బీజీఎం) బాధ్యతలను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్కు అప్పగించినట్లు ప్రకటించింది. దీంతో ఈ చిత్రానికి ఇద్దరు అగ్ర సంగీత దర్శకులు పని చేయనుండటం విశేషంగా మారింది.

# 'వృషకర్మ' నా కెరీర్‌లో మైలురాయి అవుతుంది

- **నటుడు నాగచైతన్య**

**బలగం టీవీ, హైదరాబాద్**




అక్కినేని నాగచైతన్య హీరోగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' చిత్ర గ్లింప్స్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నటుడు నాగచైతన్య మాట్లాడుతూ దర్శకుడు కార్తీక్ దండు విజన్‌పై ప్రశంసలు కురిపించారు. తాను ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కథ ఇదేనని, ఈ చిత్రం తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుందని నాగచైతన్య ధీమా వ్యక్తం చేశారు. 'తండేల్' సినిమా షఉటింగ్ సమయంలోనే ఈ కథ గురించి తెలుసుకున్నానని, దర్శకుడు కార్తీక్ దండును కలిసి ఈ ప్రాజెక్ట్ తానే చేస్తానని కోరినట్లు తెలిపారు. ఈ చిత్రంలో తాను ట్రెజర్ హంటర్ (నిధి అన్వేషకుడు) పాత్రలో కనిపిస్తానని చెప్పారు. స్క్రిప్ట్‌పై దాదాపు ఎనిమిది నెలల పాటు కసరత్తులు చేసినట్లు వెల్లడించారు. అభిమానులు ఆశించే భారీ కమర్షియల్ విజయాన్ని ఈ సినిమా సాధిస్తుందని, ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలు ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాయని ఆయన అన్నారు.

దర్శకుడు కార్తీక్ దండు మాట్లాడుతూ గ్రాఫిక్స్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పక్కా ప్రణాళికతో చిత్రాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్ కోసం ఇప్పటికే క్లైమాక్స్ షఉటింగ్ పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ పనులకు పంపినట్లు వెల్లడించారు. ట్రైలర్ విడుదల సమయంలో సీక్వెల్‌పై స్పష్టత ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా తన 25వ సినిమా వివరాలను కూడా త్వరలో ప్రకటిస్తానని నాగచైతన్య తెలిపారు.

# దుబాయ్‌లో చిక్కుకున్న ప్రయాణికులకు అండగా సోనూ సూద్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే నటుడు సోనూ సూద్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు హఠాత్తుగా నిలిచిపోవడంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన వందలాది మంది ప్రయాణికులకు ఆయన సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. విమానాలు రద్దు కావడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న వారికి ఉచితంగా వసతి కల్పిస్తానని ప్రకటించి ప్రయాణికులకు భరోసా ఇచ్చారు. సహాయం అవసరమైన వారు ఎలాంటి సందేహం లేకుండా తనను సంప్రదించాలని కోరుతూ, తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు సందేశం పంపితే తన బృందం వెంటనే స్పందించి సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ సహాయానికి ఎలాంటి షరతులు వర్తించవని, ఏ దేశస్థులైనా సరే కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటం మన బాధ్యత అని సోనూ సూద్ పేర్కొన్నారు. "ఇలాంటి సంక్షోభ సమయంలో మనుషులుగా ఒకరికొకరం అండగా ఉండటం చాలా ముఖ్యం" అని ఆయన సందేశంలో తెలిపారు.

కరోనా మహమ్మారి సమయంలో దేశవ్యాప్తంగా విధించిన కోవిడ్ -19 లాక్‌డౌన్ సమయంలో సోనూ సూద్ చేసిన సేవలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. పట్టణాలు, నగరాల్లో చిక్కుకుపోయిన లక్షలాది మంది వలస కార్మికులను వారి స్వగ్రామాలకు చేర్చేందుకు ప్రత్యేక బస్సులు, రైళ్లు, విమానాలు ఏర్పాటు చేశారు. విదేశాల్లో చిక్కుకున్న విద్యార్థులు, ఇతర భారతీయులను కూడా స్వదేశానికి రప్పించేందుకు ఆయన సహకరించారు. ఇప్పుడు మరోసారి విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం చేయడానికి ముందుకు రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. సంక్షోభ సమయంలో మానవత్వానికి నిజమైన ఉదాహరణగా సోనూ సూద్ నిలుస్తున్నారని నెటిజన్లు కొనియాడుతున్నారు. ఇప్పటికే పలువురు ప్రయాణికులు సహాయం కోసం ఆయనను సంప్రదిస్తున్నట్లు సమాచారం.